క్లుప్తంగా

నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను కలిసిన 'కొమ్మూరి'



జనగామ: హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవానికి బుధవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అంశాల గురించి కొమ్మూరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, గంగం నర్సిరెడ్డి, లింగాల నర్సిరెడ్డి, నిమ్మతి మహేందర్‌రెడ్డి, చిర్ర శ్రీనివాస్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బాల్‌సింగ్ నాయక్, సుంకరి రాజయ్య, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

సన్మానం

తరిగొప్పుల: హైదరాబాద్ సిటీ గ్రంథాలయ చైర్మన్‌గా మండలంలోని బొంతగట్టునాగారం గ్రామానికి చెందిన కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి బుధవారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభ ఆడిటోరియంలో పదవీ బాధ్యతల ప్రమాణస్వీకారం చేశారు. కాగా, గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. నాం శ్రీనివాస్, జింక రాజు, నాగరాజు, రవి, సాంబశివ, రాజ్‌కుమార్ ఉన్నారు.

'మీడియాపై దాడి హేయమైన చర్య'



జనగామ రూరల్: సినీ నటుడు మోహన్‌బాబు మీడియాపై దాడి చేయడం హేయమైన చర్య జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో బుధవారం కాసాని ఉపేందర్ అధ్యక్షతన స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియాపై దాడి చేసిన మోహన్‌బాబుపై తక్షణమే చట్టపరమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని పట్టించుకోని పాలకులు

● సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్




జనగామ రూరల్: జిల్లా అభివృద్ధిని పాలకులు పట్టించుకోవడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రకాశ్ మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని యువత హైదరాబాద్ వెళ్లి పనిచేయకుండా పరిశ్రమలు ఏర్పాటుచేసి వారికి ఉపాధి కల్పించాలన్నారు. ప్రజా ప్రతినిధులు హామీలు, ప్రకటనలకే పరిమితం అవుతున్నారని, పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి సారించాలని చెప్పారు. లింగం, వెంకటమల్లయ్య, హజారుద్దీన్, శ్రీకాంత్, సుమ, తదితరులు పాల్గొన్నారు.

నేడు 108 వాహనం ప్రారంభం

లింగాలఘణపురం: మండలానికి కేటాయించిన 108 వాహనాన్ని ఈ నెల 12న ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రవితేజ తెలిపారు. మండలానికి ప్రత్యేకంగా 108 వాహనం రావడంతో మండల ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారు. మండలానికి కేటాయించేందుకు ఎమ్మెల్యే కడియం చేసిన కృషిని మండల ప్రజలు అభినందిస్తున్నారు.

అర్హులకే డబుల్ బెడ్రూం ఇళ్లు అందించాలి



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని రాఘవాపూర్ గ్రామంలోని డబుల్‌బెడ్రూం ఇళ్లను అర్హులైన పేదలకు అందించాలని గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటీ బాధ్యులు, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు బుధవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు పింగిలేని రీగన్ రెడ్డి, రావుల రవి, కనకసాగర్, పి.శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో విస్తృతంగా వైద్యసేవలు

● ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లతో వైద్యం
● పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవలు
● సర్కార్ దవాఖానాలపై సామాన్యులకు నమ్మకం



వనపర్తి పల్లె దవాఖానలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ కిరణ్

లింగాలఘణపురం: మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ వైద్య సేవలు విస్తృతమయ్యాయి. గతంలో మండల కేంద్రంలో కేవలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే వైద్య సేవలు అందించగా నేడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖాన)లతో మరింత చేరువయ్యాయి. మండలంలోని 21 గ్రామాల పరిధిలో వనపర్తి, కుందారం, వడిచర్ల, నవాబుపేట, చీటూరు గ్రామాల్లో ఐదు పల్లె దవాఖానలు ఉండగా 11 సబ్ సెంటర్లు ఉన్నాయి. పల్లె దవాఖానల్లో క్వాలిఫైడ్ డాక్టర్లను నియమించి ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు వైద్య పల్లె ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. ఇకపోతే సబ్‌సెంటర్లలో ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉంటూ తమ పరిధిలోని సేవలు అందిస్తూ అవసరమైతే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపిస్తున్నారు. సోమ, శనివారాల్లో గ్రామాల నుంచి గర్భిణులకు 102లో ఆస్పత్రికి ఉచితంగా తీసుకొచ్చి పరీక్షల అనంతరం మళ్లీ గ్రామాలకు తరలిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి శనివారం సబ్‌సెంటర్లులేని గ్రామాలు(అవుట్ రీచ్)లకు వెళ్లి పల్లె డాక్టర్, ఏఎన్‌ఎంలు వెళ్లి వైద్యం అందిస్తారు.

98 రకాల మందులు.. 150కి పైగా టెస్టులు

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 24 గంటలు అందుబాటులో ఉంటూ 98 రకాల మందులను ఆయా రోగులను బట్టి అందజేస్తున్నారు. అంతేకాకుండా 150 రకాలకు పైగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది. అంతేకాకుండా ప్రతి మంగళ, గురువారాల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో మహిళలకు ప్రత్యేకంగా కేన్సర్, ఇతర వైద్య పరీక్షలు చేసిసేవలు అందిస్తారు. బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్, సోమ, శుక్రవారాల్లో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేయడం జరుగుతోంది. పీహెచ్‌సీ పరిధిలో 43 మంది ఆశ, 16 మంది ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సు, ఫార్మసిస్టు , ముగ్గురు సూపర్‌వైజర్లు, ఇద్దరు హెల్త్‌అసిస్టెంట్లు రోజుకు వందకు పైగా రోగులకు వైద్యం అందిస్తున్నారు. ఇకపోతే పల్లె దవాఖానల్లో 11 రకాల పరీక్షలు చేసి మందులను కూడా అందజేస్తున్నారు. వాటిలో కూడా రోజుకు 30 నుంచి 40 మంది రోగులు, సబ్‌సెంటర్లలో 20నుంచి 30 మందికి పరీక్షలు నిర్వహిస్తూ మందులను పంపిణీ చేస్తున్నారు.



పీహెచ్‌సీకి గర్భిణులను తీసుకొచ్చిన 102 వాహనం

ఊరిలోనే మందులు ఇస్తున్నారు



గతంలో మండలానికి పోయి మందులు తెచ్చుకునేది. ఇప్పుడు మా ఊరిలోనే బీ.పీ, షుగర్ పరీక్షలు చేసి మందులు ఇసున్నారు. ఇక్కడే డాక్టర్ ఉంటూ పరీక్షలు చేస్తున్నాడు. చాలా మంచిగా ఉంది. సర్కార్ దవాఖానల్లోనే బాగుంది.

\- వంచ సక్కుబాయి, వనపర్తి

మెరుగైన సేవలు అందిస్తున్నాం..



గ్రామాల్లో మెరుగైన సేవలు అందిస్తున్నాం. పల్లె దవాఖానలతో క్వాలిఫైడ్ డాక్టర్లు అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్నారు.. పీహెచ్‌సీలో 150కి పైగా రకాల పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుంది. ప్రభుత్వ దవాఖానాలపై ప్రజలకు నమ్మకం పెరిగింది. రోజుకు కనీసం వంద మందికి పైగా ఓపీ ఉంటుంది.

\- రవితేజ, మండల వైద్యాధికారి

16నుంచి ధనుర్మాస వ్రతమహోత్సవం



నిడిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ వేద పండితులు వెంకటగోపాల కృష్ణమాచార్యులు ధనుర్మాస మహోత్సవాల వివరాలు బుధవారం వెల్లడించారు. యాదాద్రి జియర్ ఆస్థాన సిద్దాంతివర్యులు కృష్ణమాచార్యసిద్దాంతిస్వామి ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి నిర్వహించే ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా జనవరి 8న విశేష నీరాజన సేవ, 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా పుష్పార్చన, 11న కూడారై ఉత్సవం, 13న భోగి పండుగ సందర్భంగా గోదా కళ్యాణం. 14న సంక్రాంతి పండుగతో ధనుర్మాస వ్రత సమాప్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. నిత్యం దివ్య ప్రభంధ సేవాకాలం, పుష్పార్చన, పాశుర విన్నపం, విశేష నివేదనలు వంటి పూజా కార్యక్రమాలు జరుగనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమాలలో పాల్గొని తరించాలని ఆయన కోరారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవాన్ని శివునిపల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని జయగార్డెన్స్‌లో అయ్యప్పభక్తులు అరిసె రవి, రమ దంపతులు, వారి కుమారుడు, కన్నెస్వామి వెంకటేష్ ఆధ్వర్యంలో గురుస్వాములు జోష్యం వినయ్‌శర్మ, మొగుదుంపురం కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోయుక్తంగా పడిపూజ మహోత్సవాన్ని కనులపండువగా చేపట్టారు. పడిపూజకు అధిక సంఖ్యలో హాజరైన స్వాములు చేపట్టిన స్వామియే శరణం అయ్యప్ప శరణుఘోషతో మండల కేంద్రం మార్మోగిపోయింది. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు చెక్కపల్లి రాజు, జక్కం లక్ష్మీనారాయణ, దారం వెంకట్రాజ్యం, కొడ లక్ష్మీనారాయణ, కట్ల శ్రీనివాస్, వనం రాజు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు

● ఏఈఓ సౌమ్య

జనగామ రూరల్: రైతులు పంట కోసిన అనంతరం వరి కొయ్యలను కాల్చొద్దని ఏఈఓ సౌమ్య సూచించారు. బుధవారం మండలంలోని పెద్దరాంచర్ల గ్రామంలో రైతులకు ఆమె అవగాహన కల్పించారు. వరి పంట అవశేషాలను కాలిస్తే భూమిలోని పంటకు ఉపయోగపడే సూక్ష్మక్రిములు నశిసాయన్నారు. సేంద్రియ పద్ధతులతో సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని రైతులకు సూచించారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

గీతా జయంతి వేడుకలు



పూజ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని గీతాశ్రమంలో సామాజిక సమరసత విశ్వహిందూ పరిషత్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నాయకుడు బచ్చు బాలనారాయణ మాట్లాడుతూ ప్రతి ఏకాదశిని ఎంతో పుణ్యదినంగా పాటిస్తారని, మార్గశిర మాసం శుద్ధ ఏకాదశికి ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి భగవద్గీత వివరించిన రోజు కావడంతో గీతాజయంతిని జరుపుకుంటామని తెలిపారు. నారాయణుడి గుడికివెళ్లి ప్రత్యేకంగా పూజలు చేయడం, భగవద్గీత పారాయణం చేస్తే జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. గునిగంటి రామకృష్ణ, గుజ్జుల కుమారస్వామి, కొల్లిపాక ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

పిల్లలను తల్లిదండ్రులు గమనించాలి

● నర్మెట సీఐ అబ్బయ్య



అవగాహన కల్పిస్తున్న సీఐ అబ్బయ్య

బచ్చన్నపేట: తల్లిదండ్రులు తమ పిల్లలు చేసే పనులు, చదువును గమనిస్తూ ఉండాలని నర్మెట సీఐ అబ్బయ్య అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని పోచన్నపేట గ్రామంలో పోలీస్ కళాజాతాను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కళాకారులు ఆట, పాటలతో సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిసకావొద్దని అన్నారు. అలాగే హెల్మెట్ లేకుండా వాహనాలపై వెళ్లరాదని అన్నారు. ఎస్సై ఎస్‌కే హమీద్, కానిస్టేబుళ్లు, పోలీస్ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

తరిగొప్పుల: నేడు(గురువారం) మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సమావేశాన్ని నిర్వహించనున్నట్లు టీజీఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎన్వీ. వేణుగోపాల చారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో తరిగొప్పుల, నర్మెట, రఘునాథపల్లి మండలాల విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చుటం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్ల మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు, కేటగిరి మార్పు,సర్వీసు రద్దు సంబంధించి సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదు అందించవచ్చని తెలిపారు.

సృజనాత్మకతతో ఉజ్వల భవిష్యత్



దేవరుప్పుల: విద్యార్థులను అభినందిస్తున్న ఎస్సై సృజన్‌కుమార్



జనగామ: సన్మానం పొందిన విద్యార్థులతో మరియాజోసెఫ్

● ఎస్సై సృజన్‌కుమార్

దేవరుప్పుల: విద్యార్థి స్థాయిలో వెల్లడయ్యే సృజనాత్మకతతో ఉజ్వల భవిష్యత్‌కు నాంది పడుతుందని ఎస్సై ఊర సృజన్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబర్చి స్టేట్‌మీట్‌కు ఎంపికైన నలుగురు విద్యార్థులు ఎ.స్నిగ్ధ, బి.సాత్విక్, జి.చాందినీ, కె. ముఖుల్‌లకు ప్రశంసాపత్రాలను అందించి ఘనంగా సన్మానించారు. ప్రయోగాత్మక విద్యాబోధనతో పరిజ్ఞానం మరింత పెంపొందుతుందని, ఈ విధానాన్ని అలవర్చుకునే విద్యార్థులు తమ మేధస్సుకు పదునుపెట్టి కొత్తకొత్త ఆవిష్కరణలు సృష్టించే అవకాశాలు లభిస్తాయన్నారు. పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు, ఉపాధ్యాయులు మదన్‌మోహన్, మహేష్, కృష్ణ, మాధవి, అనిత, విజయలక్ష్మి, ఉష, ప్రియాంక పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

జనగామ: జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన, సైన్స్ ఫేయిర్-2024లో అద్భుత ప్రదర్శనలతో రాష్ట్ర స్థాయికి ఎంపికైన సెయింట్ పాల్స్ విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మరియా జోసఫ్ బుధవారం ఘనంగా సత్కరించారు. ఇన్‌స్పైర్‌లో జో.జస్వంత్ రెడ్డి ఆటోమేటిక సెక్యూరిటీ సిస్టం ప్రాజెక్టులో స్టేట్‌కు సెలెక్టు కాగా, జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ముగ్గురు విద్యార్థులు ఈ.దివ్య, బి.మాన్సీ, పి.శ్రీసాయిఅక్షర టాలెంట్‌తో పాఠశాలకు పేరు ప్రఖ్యాతలను తీసుకు వచ్చారన్నారు. టీచర్లు, తల్లిదండ్రులు, తదితరులను పాఠశాల యాజమాన్యం ఘనంగా తస్కరించారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక



జఫర్‌గఢ్: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్: మండలంలోని తిడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.అక్షయ జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సదానందం తెలిపారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం సదానందం మాట్లాడుతూ 9వ తరగతి చదువుతున్న అక్షయ జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో అత్యుత్తమ ప్రదర్శనను కనబర్చి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని అక్షయను, గైడ్ టీచర్ శ్రవణ్‌కుమార్, జిల్లా వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌లో సేవలందించిన టీచర్ కె.సుధాకర్‌కు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు. కాగా, అక్షయకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోవు సోమయ్య రూ.500 ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఉపాధ్యాయులు నవీన్ రెడ్డి, నీరజ, శ్రవణ్‌కుమార్, నరేందర్, వేణు, సుధాకర్, నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందనలు



బచ్చన్నపేట: చందును అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బచ్చన్నపేట: పడమటి కేశ్వాపూర్ సెకండరీ పాఠశాల విద్యార్థి మాచెర్ల చందు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుపొందినట్లు హెచ్‌ఎం విజయ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం చందుకు గైడ్ టీచర్ లలత, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

బచ్చన్నపేట/నర్మెట/పాలకుర్తి: క్రీడలు మానసికోల్లాసంతో పాటు శరీరధారుఢ్యానికి దోహదపడతాయని అధికారులు అన్నారు. బుధవారం పలు మండలాల్లోని పాఠశాలల్లో సీఎం కప్‌లో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కాగా, పాలకుర్తి మండలంలో నిర్వహించిన పోటీల్లో మండల యూత్ అధ్యక్షుడు మాదాసు హరిదాసు విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

ప్రారంభోత్సవానికి తరలిరావాలి

జనగామ రూరల్: ఈనెల 14వ తేదీన హైదరాబాద్‌లోని కోకాపేటలో దొడ్డి కొమురయ్య కురుమ సంఘం నూతన భవనం ప్రారంభోత్సవానికి కురుమలు అధిక సంఖ్యలో తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో ప్రారంభోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేష్, జిల్లా అధ్యక్షుడు కంచె రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సెవెల్లి సంపత్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బాల్దే మల్లేశం, జుకంటి శ్రీశైలం, నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విద్యుత్ ఏఈ మృతి



రాములు (ఫైల్)

కొడకండ్ల: మండల విద్యుత్ ఏఈ తాటి రాములు(53) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. గత రెండేళ్లగా మండల ఏఈగా సేవలందిస్తున్న ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. ఏఈ ఆకస్మిక మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్‌లతో పాటు విద్యుత్ సిబ్బంది సంతాపాన్ని వ్యక్తం చేశారు.


సంక్షిప్త సమాచారం

దీపక్‌శాస్త్రికి జ్యోతిష్య శిరోమణి పురస్కారం



పాలకుర్తిటౌన్: మండల కేంద్రానికి చెందిన గంగు దీపక్‌శాస్త్రికి అరుదైన గౌరవం దక్కింది. తిరుపతిలోని టీటీడీ ఆడిటోరియంలో ఎస్‌ఎస్‌లైవ్ ఆస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జ్యోతిష్య పురస్కార వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా జ్యోతిష్య రంగంలో కృషి చేస్తున్న గంగు దీపక్‌శాస్త్రికి ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ అమెరికన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ సంస్థ జ్యోతిష్య శిరోమణి పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీటీడీ ప్రధాన పూజారి శ్రీ రంగాచారి, ఎస్‌ఎస్ లైవ్ ఆస్ట్రో వ్యవస్థాపకులు నరసింహస్వామిలు పాల్గొన్నారు.

ఓబులాపూర్ వాసికి..



జఫర్‌గఢ్: ఓబులాపూర్ గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ నంచర్ల రాజ్‌కుమార శాస్త్రి జ్యోతిష్య శిరోమణి అవార్డును అందుకున్నారు. తిరుపతిలోని టీటీడీ ఆడిటోరియంలో ఎస్‌ఎస్‌లైవ్ ఆస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శ్రీరంగాచార్యులు, నారాయణ, డాక్టర్ గోపినాథ్ డాక్టర్ నర్సింహస్వామి చేతుల మీదుగా ఈ అవార్డును బుధవారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కాగా, అవార్డు అందుకున్న రాజ్‌కుమారశాస్త్రికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

వ్యక్తి రిమాండ్

పాలకుర్తిటౌన్: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కమ్మగాని శోభన్ అనే వ్యక్తి మంగళవారం రాత్రి ఓ మహిళ ఇంటి తలుపుతట్టాడు. సదరు మహిళ భయంతో తలుపు తీయగా ఆ సమయంలో నిందితుడు అసభ్యంగా ప్రవర్తించగా కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోగానే నిందితుడు ద్విచక్ర వాహనం వదిలి పరారయ్యాడు. మంగళవారం రాత్రి బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి బుధవారం శోభన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చేయూత

పాలకుర్తి: పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కన్నెబోయిన (నాంపల్లి) రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బుధవారం తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్ గ్రామానికి చేరుకుని రమేశ్ భార్య అనితను పరామర్శించి ఆర్థికసాయంతోపాటు 50కిలోల బియ్యం అందజేశాడు. కమ్మగాని మహేష్ గౌడ్, కామారపు సునీల్, ఆకుల నాగరాజు, గాందారి శ్రీను, గజ్జి జనార్దన్, జంపాల కృష్ణ, దేశబోయిన సంపత్ ఉన్నారు.

ప్రొడక్షన్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికైన మండల వాసి



అరవింద్

దేవరుప్పుల: మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ పరిధి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ విభాగంలో మండలంలోని కడవెండికి చెందిన చేనేత కార్మికుడు నల్ల కుమారస్వామి, ఉర్మిళ కొడుకు అరవింద్ ప్రొడక్షన్ అసిస్టెంట్ (లెవల్-6) ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈస్ట్‌మారెపెల్లి పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేసే క్రమంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం పొందడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

● సీఐ మహేందర్‌రెడ్డి



నిందితు అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న సీఐ

కొడకండ్ల: యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. గంజాయి విక్రయించినా, తాగినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకొంటామని, యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని కోరారు. మండల శివారులోని గుమ్ములబండ తండ వద్ద ఒక వ్యక్తి గంజాయితో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా స్థానిక ఎస్సై చింత రాజు పట్టుకుని విచారించగా బీహార్‌కు చెందిన దీపక్‌కుమార్ మండల్(27)గా గుర్తించడం జరిగిందన్నారు. అతని వద్ద ఉన్న 10 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో సత్తా చాటిన విద్యార్థులు



మేఘన



శరణ్య

కొడకండ్ల: జిల్లా స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో మండల విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో మండలకేంద్రానికి చెందిన తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు కె.మేఘన ప్రథమ స్థానం, కె.శరణ్య ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఇద్దరు విద్యార్థినులను ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ అభినందించారు. అలాగే ఏడునూతుల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి షేక్ అబ్బాస్ కూడా మ్యాథ్స్ టాలెంట్‌టెస్ట్‌లో సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచాడు.

గణిత ప్రతిభాపాటవ పోటీల్లో శృతి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న శ్రుతి

దేవరుప్పుల: శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన గణిత ప్రతిభాపాటవ పోటీలో తెలుగు మీడియం విభాగంలో మాదాపూర్ హైస్కూల్ విద్యార్థి దొంటిక శ్రుతి జిల్లా ప్రథమ స్థానం సాధించింది. ఈ నెల 18వ తేదీన రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లో పాల్గొననున్న శ్రుతికి మండల టీఎంఎఫ్ అధ్యక్షుడు బెహరా రవికాంత్, హెచ్‌ఎం రమేశ్, గణిత ఉపాధ్యాయులు మాధవి, అశోక్,భాస్కర్ అభినందనలు తెలిపారు.